


# విషాద భారతి

బొల్లిముంత నాగేశ్వరరావు

ఆకాశం నిర్మలంగా ఉంది. ఉషోదయాన్ని సూచిస్తూ తూర్పు ఎర్రబడింది. ఎక్కడో దూరంగా కోడి కూసింది. అప్పటివరకూ ప్రజ్వలించిన వేగుచుక్క ఆకాశంలోని అరుణారుణ కాంతుల్లోకి మెల్లిగా దూరి విశ్రాంతిని తీసుకుంటుందా అన్నట్టు మాయమైపోయింది. కాకులరుస్తూ లోకాన్ని లేపుతున్నాయి. రాత్రి చల్లదనాన్ని భుజాల మీదెక్కించుకుని గాలి మెల్లిగా వీస్తుంది. చీకటి శీతలత్వం తాలూకూ మైకాన్ని విదుల్చుకుంటూ, వెలుగు రేఖల వైపుగా చెట్లన్నీ తలలాడిస్తున్నాయి.

సెలయేరులోని కమలాలన్నీ తను మిత్రుని అగుపాన్ని పసిగట్టి అవ్యక్తానందాన్ని రేకుల పొరల్లోంచి వెలిగక్కుతూ విచిత్రంగా ...పూయి తున్నాయి. కప్ప లేచినప్పుడూ, గాలి కూగినప్పుడూ ఆకులమీదికి చేరిన నీటి బిందువులు ముత్యాల సొయగంలో మురిసిపోతున్నాయి.

వసంతం ఇంకా రాకపోయినా, తనవేళ కాకున్నా, కాకుల అరుపులకి కోయిలమ్మ ఎక్కడో శ్రుతికలిపింది. ఇంకా చలితీరని ముసలి మనిషి మరో మంట వేడుతున్నాడు. మంటల్లోంచి జ్వాలలు చిత్రంగా పైకిలేస్తూ శూన్యంలో కలిసిపోతున్నాయి.

ఉదయ సంధ్యలోని ఆనందాన్ని హృదయంలో ఆనందిస్తూ బాబ్జీ నడుస్తున్నాడు. బాబ్జీ చిత్రకారుడు. ప్రకృతి అందాలన్నీ అతని మనో ఫలకం మీదినుంచి చిత్రంగా చేతిలో నాట్యం చేసే కుంచెద్వారా రంగు రంగుల్లో కాగితాల మీదికి చేరాయి. పచ్చి గడ్డి, పక్షులూ, తెల్లని బయళ్ళూ, దూరంగా ఎక్కడో కనిపించే నల్లరాతి బండలూ, ఎత్తయిన కొండలూ, ఏర్లూ, సెలయేర్లూ, చంద్రుడూ, చుక్కలూ, పయనించే మేఘాలు, ప్రభవించిన విద్యుత్ మెరుపులు, హరివిల్లూ, పొదరిల్లూ ఎన్నింటినో చిత్రించాడు. బాబ్జీ చిత్రించిన వెన్నో అనేక కళా ప్రదర్శనశాలల్లో చోటు చేసుకున్నాయి. ఫలితంగా అనేకమంది రసాస్వాదుల హృదయాల్లో కూడా చోటు చేసుకున్నాయి.

అయినా బాబ్జీ కేదో అసంతృప్తి!

ఈ దేశం యొక్క వికసిస్తున్న యౌవనాన్ని, చిగురిస్తున్న చైతన్యాన్ని ఒక పల్లెటూరి లేపడుచు పటంలో ప్రమోదంగా ప్రకాశంగా చిత్రించాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా అతని మనోపథంలోకి చిన్ననాటి తన ఇంటి ఎదురు భారతి గుర్తుకు వచ్చింది.

భారతి.

ఎంత చలాకీగా ఉండేది. గరిక పచ్చ మైదానంలో గెంతుతూ ఆడుతుండేది. వర్షం కురిస్తే చినుకుల్లో 'వానావానా వల్లప్ప' అనుకుంటూ సంతోషంతో గిరగిరా తిరిగేది. మెరుపు మెరిస్తే మురిసిపోయేది. ఆకాశంలోని హరివిల్లును చూసి ఆనందంగా ఎగిరి గంతులేసేది.

వసంతంలోని కోయిలమ్మ పాటకు వంతపాడుతూ 'కుహూ' 'కుహూ' అంటూ అరిచేది.

పెదాలు ఎర్రగా, ముక్కు బారుగా మనిషి విటారుగా ఉండేది. ముఖం కోలగా బుగ్గలి చిదిపితే కారే పాలుగా ఉండేది. వికసించిన గులాబీ పువ్వులకోసం తోటలోకి తొంగి చూసేది. తోటలోని ఎర్రగులాబీలన్నీ ఆమె బుగ్గల్లోంచి లోకం వైపుకి తొంగిచూసేవి!

నీనీలాకాశంలోని విశాలతత్వం ఆమె కళ్ళల్లో ఉంది. నక్షత్రాల మెరుపూ, చంద్రుడి ఎరుపూ, సూర్యుడి తెలుపూ ఆమె కళ్ళల్లో వింతగా ప్రతిఫలించేవి!

పాయలుగా ప్రవహించే జీవనదుల వల్లని గంభీరతత్వం ఆమె జడపాయల్లో కనిపించేది. కిలకిలా నవ్వేది. చురచురా పరిగెత్తేది.

ఇప్పుడా భారతి ఎంత ఎదిగిందో?

ఒక్కసారి చూసి తన చిత్రానికి రూపాన్ని దిద్దుకోవాలి.

వినోద భారతి—కాదు కాదు విషాత్మ భారతి, నవీన భారతి—కాదు కాదు. నా మాతృదేశానికి సంకేతం! సమోహనమో భారతి!

ఇప్పుడే వెళ్ళి చూడాలి.

బాబ్జీ అనుకుంటూ అడుగులు వేగంగా వేస్తున్నాడు. అతన్ని పల్లెల కౌగిట్లోకి విసిరిన పొగబండి గాలిని దూసుకుంటూ గంట క్రితమే స్టేషన్ను వదిలిపోయింది. స్టేషన్ వదిలి బాబ్జీ తన గ్రామంవైపుగా నడవటం మొదలెట్టాడు.

మూడు కిలోమీటర్ల దూరాన్ని అధిగమించి గ్రామం పొలిమేర్లకు చేరాడు!

పట్టణం పొలిమేర్లని నిన్న ఆరుగంటలకు వదిలాడు. తను నివసిస్తున్న పట్టణానికి తన

గ్రామం రైలుబండిలో వస్తే సంధ్యాదిహారంలో ఉంది !

సంధ్యాద్వారంలో సంధ్యా రాగం.

అతని మనసు అవ్యక్తంగా కూనిరాగం తీసింది!

ఇల్లు సమీపిస్తున్నకొద్దీ మనసు గతాన్ని లీలగా ఆలోచించింది !

*  *  *

హైస్కూలు చదువు పూర్తి కావటంతోనే తానీ గ్రామం వదిలాడు. హైదరాబాదులో నాన్నకు ప్రైవేటు కంపెనీలో మంచి ఉద్యోగం. కాలేజీ చదువులూ, విశ్వ విద్యాలయంలో పి హెచ్. డీ. లు, తర్వాత లెక్చరర్ ఉద్యోగం—అన్నీ ఇంతకాలమూ పల్లెముఖం చూడకుండానే జరిగిపోయాయి. నాయనమ్మ పట్నం వసేమిరా రానంది. వృద్ధాప్యాన్ని జయిస్తూ ఇంకా వంట చేసుకునే వయసులోనే ఉంది. నాన్నే ఆరునెల్లకోసారి వచ్చి తల్లి యోగక్షేమాల్ని కనుక్కుంటుండేవాడు. అత్తయ్యది కూడా ఈ వూరు కాపురం అవ్వటం నాన్నకు కలిసొచ్చిన అవకాశం.

ఏది ఎలాగున్నా నాయనమ్మను చూసి కూడా చానాళ్ళయ్యింది. బాబ్జీ మనసు సంతోషంతో పరవళ్ళు తొక్కుతుంది !.


తను చదువుకొనే రోజుల్లో తనకెంతో సన్నిహితంగా ఉండే రమణా, రాజీలు ఇప్పుడేం చేస్తున్నారో. పై చదువుల కెళ్ళారో లేక అంతటితోనే ఆగిపోయారో !

రమణ చిన్న చిన్న కథలూ, పాటలూ వ్రాస్తుండే వాడు. రాజీ చక్కగా పాటలు పాడుతుండేవాడు. హైస్కూల్లో డ్రాయింగ్ పిరియడ్ వస్తేనే చాలు. మాస్టారు ముందుగా రాజీని లేపేవాడు. ఒక పాట పాడమనేవాడు. అదేమిటో వాటి కంటం తీయగా గదంతా ప్రతిధ్వనించేది. తర్వాత తనచేత ఒక బొమ్మను బ్లాక్‌బోర్డు మీద గీయించేవాడు. తనెంతో అనుభవం ఉన్నవాడిలా చకచకా గుర్రాల్ని, పక్షుల్నీ మాస్టారు ఏది గీయమంటే అదే గీయటం జరిగేది. ఆయనెంతగానో మెచ్చుకునేవాడు. తర్వాత రమణనో చిన్న నీతికథ చెప్పమనేవాడు. వాడేమిటో రకరకాల కథలు చెప్పేవాడు. ఈ కథెక్కడ చదివావురా అని మాస్టారడిగితే తనే వ్రాసనేవాడు. ఆయన కొంచెం ఆశ్చర్యంగా కాస్సేపు రమణవంక చూసేవాడు.

తాము ముగ్గురూ మిత్రులుగా ఉండటం కూడా ఆయనకు సంతోషం కలిగేది. ముగ్గుర్నీ 'మిత్రత్రయం' అని పిలిచేవాడు. తర్వాత అర గంటలో ఆయన బొమ్మల్ని వేసి నేర్పేవాడు.

ఇప్పుడాయన ఎక్కడుంటున్నాడో ? ?

తను ముగుర్నీ వ్యతిరేకంగా చూస్తుండేవాడు వెంకట్రావ్ ! అప్పట్లో క్లాస్ లీడర్ కూడా వాడే. వెంకట్రావు కుటుంబానికి ఒక్కడే కొడుకు. వెనుక బాగా ఆస్తి ఉంది. ఎప్పుడూ ఏదో ఒకటి గ్రెలా నములుతూ ఉండేవాడు. మీగడ పెరుగంతా తనే తింటానని క్లాసులో గర్వంగా చెప్పుకుంటుండేవాడు. తిండికి తక్కువ్వే మనిషి కూడా బలిష్టంగా ఉండేవాడు. అరలాగుల్లోంచి వాడి



కాళ్ళు చూస్తుంటే మున్సిబ్‌గారి మెట్టమీదున్న టేకు చెట్టుమొదల్లా లావుగా, గుండ్రంగా ఉండేవి.

చదువు సరీగా ఎప్పుడూ వంటబట్టేదికాదు. మార్కులు ఏ సబ్జెక్టులో చూసినా ముప్పయ్‌కి దాటేవికాదు. అవీ ప్రక్కవాణ్ణి అంటకాగి కాపీ కొడుతుండేవాడు.

అలాంటి వెంకట్రావు వూరుకు ప్రెసిడెంటు అయ్యాడని మొన్ననే తెలిసింది. ఏదో పొలిటికల్ పార్టీ యువజన విభాగంతో అతనికి సన్నిహిత సంబంధముందనీ, గ్రామమంతా అతని పెత్తనం క్రిందనే సాగిపోతుందనీ మొన్ననే నాన్న తనకు చెప్పినట్టు గుర్తు !

*  *  *

"ఏదీ...ఈ గ్రామం. తను వదిలినప్పు డెలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంది. కాకుంటే ఆ ఎత్తుగా కనపడేది వెంకట్రావు మేడ! ఈ చుట్టు ప్రక్కల పొలాలన్నీ కొనేశాడని నాన్న చెప్తుండేవాడు. బాగా ఎదిగినట్టున్నాడు ! రోడ్లలాగే ఉన్నయ్. బక్క రైతుల ఇళ్ళు అలాగే ఉన్నాయి.

'పిచ్చిరావుడు' బ్రతికే ఉన్నాడు. పెరిగిన గడ్డం, చింపిరి దుస్తులూ మనిషేం మరిగిపోలేదు. ఎలా బ్రతుకుతాడో ఏమో....ఎండకీ, చలికీ, వానకీ ఎప్పుడూ గురవుతూనే ఉంటాడు. ఇంటింటికీ తిరిగి అడుక్కుని తింటాడు, స్నానం ఉండదు, శుభ్రత ఉండదు. అయినా అతని జీవితం సాగిపోతూనే ఉంది.

అయినా పాపం అతనిదేం జీవితం ? ఎప్పుడో ఎక్కడో అనాధగా రాలిపోతాడు. అప్పుడెవ్వరూ అతన్ని గురించి పట్టించుకోరు.

వేకువతో కాకుల గోలతో లేచేది రావుడే.... తనలో తాను నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ జీవిస్తాడు. అతని కెందుకు ఇలా పిచ్చి పట్టిందో... ఎవరికీ తెలీదు. కానీ అంతా పిచ్చి రావుడనే అంటారు. వృద్ధాప్యం దగ్గరకు వచ్చినట్టుంది. గడ్డం వెత్తిమీద జుట్టూ తెల్లబడిపోయింది.

ఇంకా జనం ఎవరూ సరీగా లేవలేదు.

ఈ ఉదయ సంధ్యలో ఇంకా భారతి నిద్రపోతూనే ఉంటుందా? లేక కడివెడు నీళ్ళూ కలాపి జల్లి....' అనుకుంటూ, పాడుకుంటూ పనులు చేస్తుంటుందా? అయినా ఏమిటీ పిచ్చి. భారతి రూపంమీద ఇంత ఆరాధనా?

అవును—ఆరాధనే. ఒక పవిత్రమైన ఆరాధన. తనకా బొమ్మ వెయ్యాలని వూహ రావటం, ఇంటిముందు భారతి గుర్తుకు రావటం—వచ్చిందే తడవుగా ప్రయాణం కావటం—సామాన్యమా మరి... నిజంగా తనది పవిత్రమైన ఆరాధనే....

నాన్న నడిగితే...భారతి కింకా పెళ్ళికాలేదని చెప్పాడు. అవును. అంత చక్కని రూపానికి తగిన వరుడు ఎక్కడ దొరుకుతాడు? భారతికి ఆలస్యంగానే వివాహం జరుగుతుంది ! తను తప్పకుండా భారతి వివాహ ఘట్టానికి హాజరుకావాలి. ఎప్పుడో—ఎక్కడో తెలుసుకుని మరీ హాజరు కావాలి.

భారతి తనకు పొదరి వరసవుతుంది. దగ్గర బంధువులు కాదు. దూరపు చుట్టరికం.

ఇంకా ఎవరూ లేవలేదేమో ! ఎరుగున్నవాళ్ళు ఒక్కరూ కనబడలేదు."

ఇంతలో ఇల్లు దగ్గరకు వచ్చింది. భారతి ఇల్లూ బాబ్జీ ఇల్లూ ఎదురెదురుగా ఉన్నాయి. ఇంకా చీకటి బద్దకం నుంచి తలుపులు తెరుచుకోలేదు.

ఇంటి ముంగిలి కెళ్లి క్రింద ఒక్కసారి చుట్టూ కలియ జూచాడు. వరండాలో నాయనమ్మ పెట్టిన ముగ్గుల్లో ఏదో అర్థం కనిపించింది. వాటిని చూస్తూ అలాగే నిలుచుండిపోయాడు.

## 2

మనుమడొచ్చిన సందర్భంలో నాయనమ్మ మరీ మరీ సంతోషపడింది. కూతురింటికిపోయి పాలు తీసుకొచ్చి చిక్కగా టీ పెట్టి ఇచ్చింది. ముఖం కడిగాక వేడినీళ్ళు తోడింది.

స్నానంచేసి ఇంట్లోకి వచ్చేసరికి ఉప్మా చేసి సుందమర్చింది.

'నానమ్మకు ఇంకా వంట్లో ఓపిక బాగా ఉంది' బాబ్జీ అనుకున్నాడు.

టిఫిన్ చెయ్యగానే నిద్ర ముంచుకొచ్చింది,

ఈ నిద్ర కళ్ళతో బయటికి పోయి భారతిని చూడగూడదనుకున్నాడు. కమ్మగా కాస్సేపు నిద్ర పోయాక మరొక్కసారి నానమ్మ చేతి చిక్కటి టీ తాగి భారతిని చూడాలనుకున్నాడు.

మెల్లిగా మంచం వాల్చుకుని నిద్రలోకి జారుకున్నాడు.

* * *

ఉదయం ఏడుగంటలకు పడుకుంటే పదకొండు గంటలకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూసేసరికి బయట తెగ ఎండ కాస్తుంది.

ఇంటి ముంగిట్లో గులాబీ పొదమీద చక్కగా పూలు విరగబూచి కనిపిస్తున్నాయి. ముద్దబంతి పూలచెట్లు ప్రహరీగోడకు ప్రక్కగా వరుసలు తీరి ఉన్నాయి. చేరెడంత వెడల్పులో ఎర్రగా, తెల్లగా పూవులు కనిపిస్తున్నాయి. ఎంతో అందంగా ఉన్నాయి.

'నానమ్మా!' బాబ్జీ మెల్లిగా పిలిచాడు. నానమ్మ పలుకలేదు.

నానమ్మ, అత్తయ్యా వంటింట్లో ఉన్నారనీ, వంటింట్లోంచి గారెల వాసన వస్తుందనీ మెల్లిగా పిలిస్తే నానమ్మ పలికే స్థితిలో లేదనీ బాబ్జీ అనుకున్నాడు.

తనంటే నానమ్మకు ఎంత ప్రేమ! ఉద్యోగమూ, బొమ్మల చిత్రీకరణలో తను మొత్తం మర్చిపోయాడు. ఇప్పుడు కూడా నానమ్మను చూద్దామనా తనొచ్చింది....లేదు. ఇప్పుడూ చిత్రం పని మీదే వచ్చాడు.

బాబ్జి చిన్నగా నవ్వుకున్నాడు.

'భారతి మరలా మనోపథంలోకి తళుక్కున వచ్చింది. తను హైస్కూలు వదిలేప్పుడు భారతి ఏడవ తరగతి చదువుతుంది. తరగతిలో ఎంత ముచ్చటగా ఎంత ముద్దుగా ఉండేది! తెలియని లెక్కలు తన దగ్గరకొచ్చి చెప్పించుకు వెళ్తుండేది.

'అన్నాయ్, అన్నాయ్' అనుకుంటూ ఎప్పుడూ తన చుట్టూ తిరుగుతుండేది.

అలాంటి భారతి ఇప్పుడా గుర్తుకు రావటం. అదీ చిత్రం గీయాల్సిన పరిస్థితుల్లో విచిత్రంగా గుర్తుకురావటం.

పేద భారతి—పెద్దగా ఆస్తి లేదు. తండ్రి పనిచేస్తేనే గాని గడవని స్థితి. నానమ్మ అప్పట్లో ఏదో నాగకీ వారకీ సాయం చేస్తున్నట్టు గుర్తు.

ఈ తెల్లని సూర్యకాంతిలో తెల్లగా నవ్వుతూ ఉన్నా, తను గీయబోయే బొమ్మకు స్పష్టమైన ఆకారం వస్తుంది. ఒక పరిపూర్ణత దొరుకుతుంది! బద్దకంగా బాబ్జీ ఒళ్ళు విరుచుకుని మెల్లిగా వంటింట్లోకి పోయాడు. అక్కడ అతని అత్తయ్య కనపడి మెల్లిగా నవ్వింది.

'నేనే మీ ఇంటికి వద్దామనుకున్నా. మీరే ఇక్కడ ముందుగా కనిపించారు' బాబ్జీ నవ్వుతూ అన్నాడు.

'ఈ వూరు రావటమే ఇన్నేళ్ళు పట్టింది. ఇక మా ఇంటికి రావటం ఎన్నాళ్ళు పడుతుందోనని నేనే చూడటానికి వచ్చాలేరా!'

కాస్తంత వ్యంగ్యాన్నీ, హాస్యాన్నీ జోడించి ఆమె అంది.

---

**నీవు చెప్పేది సత్యమే కావచ్చు. ఆ సత్యాన్ని తెలుసుకునే హక్కు, అర్హత అవతలివాళ్ళకి ఉండాలి, అది లేనప్పుడు నీవు చెప్పే నిజాలకు ప్రయోజనం, విలువ ఉండదు.**

—హోరేస్ మాన్

---

దానికి ఏం సమాధానం ఇవ్వాలో బాబ్జీకి అంతుపట్టలేదు, చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

'మామయ్యా, పిల్లలూ బాగున్నారా?' ప్రశ్నించాడు.

'ఆ బాగానే ఉన్నారు' ఆమె సమాధానం ఇచ్చింది.

'పిల్లలు స్కూలుకు పోయారా!'

'ఆ...ఇద్దరూ హైస్కూలుకి పోతున్నారుగా. ఎనిమిది గంటలా సమయంలో నిన్ను చూద్దామని వచ్చారు. నీవేమో నిద్రపోతున్నావని తెలిసి నిద్ర చెడగొట్టటమెందుకని, తిరిగి వచ్చేశారు.'

'అరే...పోనీలే—సాయంత్రం నేనే వస్తాను.'

'ముందు నువ్వు స్నానమూ, కాళ్ళూ చేతులు కడుక్కురా.'

ఆమె చెప్పగానే బాబ్జీ కాళ్ళూ చేతులు కడుక్కోవటానికి పోయాడు. ఆమె వంటింట్లో భోజనం ఏర్పాటు చేసింది.

## 3

'నో...అలా జరగటానికి వీలులేదు' బాబ్జీ కళ్ళు ఎర్రబడ్డాయి. ఎదురుగా కూర్చున్న నాయనమ్మ, అత్తయ్య బాబ్జీ ప్రవర్తనకు కాస్త ఆశ్చర్యపోయారు.

'జరగడానికి వీలులేదంటావేమిట్రా—జరిగిపోతే' బాబ్జీ నానమ్మ అంది.

'అసలు మీరంతా ఏంచేస్తున్నారు. కాస్త సహాయం సానుభూతిగా అందిస్తే ఈ దారుణం జరిగేదేనా' బాబ్జీ కళ్ళల్లో ఈసారి నీళ్ళు తిరిగాయి.

'ఎవరందిస్తారు—ఎందాకని అందిస్తారు' అతని అత్తయ్య అంది. వెంటనే మరలా ఆమే కల్పించుకుని.

'అయినా నువ్వలా అయిపోతావేమిట్రా—దాన్నదే పనేముంది. ఈ దేశమే అలా అయిపోయింది....పదే...అప్పుడా సంగతి తెలుసుగాని... రాత్రి అక్కడే నీకు వంటచేస్తాను. మా ఇంటికిరా' అంటూ ఆమె పోయింది.

బాబ్జీ నానమ్మ ఏదో పని చేసుకోవటానికి బయటికి పోయింది.

పగలు అంత వెలుగులోనూ బాబ్జీ కళ్ళల్లో ఏదో చీకటి ఆవరించినట్లయ్యింది. తన వూహ ఎంత విషాదంగా పరిణమించిందీ, తను గీయబోయే చిత్రం ఎంతటి అమూల్యమైన పరిస్థితి, మలుపు తిరిగిందీ తలుచుకున్నప్పుడు ఏదో కరుణా కసీ, ఆవేశం రకరకాలుగా పెనవేసుకుని విచిత్ర పరిస్థితుల్లోకి అతన్ని తీసుకుపోయాయి!

'...ఈ భారతి అవసరాన్ని ఆసరాగా తీసుకుని, తమ్ముడికి ఉద్యోగం ఇప్పిస్తాననీ, పేదరికం పోగొడతాననీ కల్లబొల్లి కబుర్లు చెప్పి—ఎంత అమానుషానికి ఒడిగట్టాడు వెంకట్రావ్. తన అధికారం కబంధ హస్తాల్లోకి పేద భారతిని వలపన్ని లాక్కున్నాడు. తన ఐశ్వర్యపు విషదంష్ట్రల్లోకి అమూల్యమైన ఆమె సౌశీల్య సంపదను అలాగా ఇరికించుకుని అనుభవిస్తున్నాడు.

ఇక్కడి జనం ఏం చేస్తున్నట్టు? ప్రక్కవాడి పరిస్థితిని ఏమాత్రం పట్టించుకోని దిక్కుమాలిన స్థితికి వీరెందుకు పోతున్నట్టు? చదువూ,సంస్కారం ఏం లేకపోయినా, పదవీ పైకం రెండూ ఉంటే చాలా? వాడాడింది ఆటగా, పాడింది పాటగా తలలూపుతారా?

నో...ప్రజలనలా అంచనా వెయ్యకూడదు. ఇక్కడి క్రూరత్వం సాచిన పంజాదెబ్బలకే వారి అమాయకత్వం బలైపోతుంది. ఆకలిలో, అవసరాల్లో, బ్రతుక్కి భరోసాలేని పరిస్థితుల్లో ఏది చెప్పినా నమ్మే స్థితికి వారెళ్ళిపోతున్నారు. ఎండ మావుల్లోని నీటికోసం దప్పికగొన్న జంతువుల్లా పరిగెత్తుతున్నారు. ఇక్కడి స్వార్థం కల్పించిన భయాపూరిత గాలంచుట్టూ ఉన్న ఎరలోని ఎర్రని మాంసాన్ని నిజమైన ఆహారంగా భ్రమసి ఎగబడి పోయి, చేపల్లా చిక్కుకుంటున్నారు.

ఇదిలా కొనసాగిపోవలసిందేనా...

బాబ్జీ పెద్దగా నిట్టూర్చాడు!

వెంకట్రావు—చదువు కూడా సరిగా రాని వెంకట్రావు. మనిషికీ, జంతువుకీ తేడా తెలీని వెంకట్రావు—మానవత్వం విలువలు తెలీని వెంకట్రావు—'మనీ' మాత్రమే ఉన్న వెంకట్రావు—ఈ గ్రామాన్ని పాలించేవాడా? వాడి పరమ నీచమైన పడుపు వృత్తికి ఈ పేద భారతి బలైపోవాలా?

'నో'...అతని అంతరంగం మరోసారి పెద్దగా అరిచింది.

'నానమ్మ చెప్పిన కథ ప్రకారమే అయితే ఇది భరించరానిది...'

మొదట ప్రేమిస్తున్నట్టు నటించాడు, తర్వాత పెళ్ళి చేసుకుంటానని భ్రమలుకల్పించాడు. ఈలోగా భారతి తండ్రి చనిపోయాడు. ఉన్న కొద్ది కొంపా అప్పుల్లో హరించుకుపోయింది. భారతి తమ్ముడు పదోతరగతి పాస్ అయ్యాడు. పైపు నేర్పించాలంటే పట్నంపోవాలి. ఇక్కడ తిండి సమస్య. పట్నంపోయే చార్జీల సమస్య. అన్నీ భారతికి అసాధ్యమైపోయింది.

నేర్పుగా వెంకట్రావ్ భారతిని పట్నంతరలించాడు. అక్కడ అద్దెకో ఇల్లు తీసుకున్నాడు. అందులో భారతినీ, ఆమె తమ్ముణ్ణీ ఉంచి సమస్తమూ తానే సహించటంమొదలెట్టాడు. చివరికి భారతి సమస్తాన్నీ తన బాహువుల్లోకి తీసుకున్నాడు.

ఒక సంవత్సరంలో వెంకట్రావ్ ఒక కలవారమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు.

భారతి ఇప్పుడతనికి మరో భార్య....భార్య కాకపోవచ్చు. మరేమయినా కావచ్చు. కొన్నాళ్ళకు ఆమె యవ్వనాన్నంతా పిప్పిచేసి వదిలేయవచ్చు.

అప్పుడు భారతి జీవితం ఎలా ఉంటుంది?

వూహించరాని విషాదంగా ఉంటుంది.

ఈ పరిస్థితులన్నిటికి విసిగి భారతి తమ్ముడు ఎటో పారిపోవచ్చు.

మరి నాన్న ఈ సంగతులన్నీ తనకు చెప్పలేదేం... తెలిసినా తనతో సంప్రదించటానికి నిరాకరించ లేదా?

బాబ్జీ తల బరువెక్కిపోయింది.

'ఏంత చక్కని పిల్లరా—ఏంచేస్తాం... దాని గతి అలా అయింది' అత్తయ్య విషయం చెప్తూ అన్నమాటలు అతని మనోఫలకంలో మెదిలాయి.

'పోనీ మరానికో...అది నా ఇష్టం. నాకు వదిలి ఉంది. పైకొస్తుంది. అయినా స్వార్థపరులు అనగటానికి' వెంకట్రావు అంటున్నాడు. వెంకట్రావు రూపం గుండ్రంగా సింహం ఎండిలా ఉంది. కళ్ళు మూసుకుపోయి ఉన్నాయి. మూసుకుపోయిన కళ్ళల్లో గట్టిగా తెరిచినప్పుడల్లా ఎర్ర జీరలు కనిపిస్తున్నాయి. ఒక పెద్ద రాయిమీద కూర్చుని ఉన్నాడు. అతనికి వెనుక విశాలంగా, నీలంగా, గంభీరంగా ఏదో సముద్రమున్నది. అతను కూర్చున్న రాయి గట్టిగా నెట్టితే సముద్రంలో పడిపోయేట్టు ఉంది. ఆ రాయిని వెనగ్గా ఎవరో పనిచేసే మనుషులు పట్టుకున్నట్టు ఉంది.

వెంకట్రావుకు దూరంగా మరో గుట్టమీద భారతి విషాదంగా నిల్చుని ఉంది. ఆమె ప్రక్కనే కూర్చుని ఆమె తమ్ముడు ఏదో చదువు కుంటున్నాడు.

బాబ్జీ ఎదురుగా నిలబడి అంటున్నాడు.

'నా దేశంయొక్క ప్రతిరూపాన్ని ఆ భారతిలో చూసుకోవాలని చెప్తాను. ఈ స్వేచ్ఛాపథంలోని యువ్వనాన్నీ, చైతన్యాన్నీ ఆమె రూపంలో చిత్రించా లనుకున్నాను. పల్లెసీమల్లోని ప్రకృతి అందాన్నీ, నైర్మల్యాన్నీ, శాంతాన్నీ, సహనాన్నీ, శీలాన్నీ— గర్వంగా, గంభీరంగా చిత్రించాలనుకున్నాను. ఈ పవిత్ర స్వరూపాన్ని ప్రపంచం మెుత్తానికి చాటా లనుకున్నాను. నేను గీసిన ఈ గొప్ప బొమ్మలోని చైతన్యాన్ని నా కవి మిత్రులు పాటలుగా వ్రాస్తే, నా గాయక మిత్రులు గొంతెత్తి పాడాలని ఆశించాను.

"కానీవెంకట్రావ్ నువ్వింతదుర్మార్గంచేస్తావా?"

వెంకట్రావ్ పెద్దగా నవ్వాడు. అతడు నవ్వు తుంటే క్రింద కూర్చున్న బండ అతనితోపాటు కదిలిపోయింది.

"ఎందుకు నవ్వుతావ్?" బాబ్జి గట్టిగా, పెద్దగా అడిగాడు.

"అవునురా ... ఇప్పుడుమాత్రం మునుముకు పోయిందేం ఉంది. ఇప్పుడూ భారతిని పొగడండి. వాడు ... రఘుగాడు — కథలూ, పాటలూ రాస్తాడే ... వాడ్ని గొప్పగా వ్రాసెయ్యమను. ఇకకోడు ... నీతోపాటు ఉండేవాడు ... రాజీ ... వాడ్ని పెద్దగా పాడేసెయ్యమను. నువ్వు రంగు రంగుల్లో బొమ్మలు గీసెయ్. నేనున్నాను చూశా... తృప్తి తీర అనుభవిస్తాను ... అదే రాజకీయం. తెలిసిందా?"

"నీ కా పేద భారతిని చూస్తే జాలి వెయ్యటం లేదురా?"

"ముయ్యరా నోరు. పేద భారతి కాబట్టే నా చేతుల్లో కొచ్చింది! నీకేం తెలుసురా పక్షీ. అది ఆకలితో మాడిపోతుంది! ఒకరోజు గంజి కాసుకుని

అదీ దాని తమ్ముడూ తాగుతున్నార్రా ... ఒరేయ్ బాబ్జీ అప్పుడు నేను వెళ్ళాను. చక్కగా కబుర్లు చెప్పాను ..." వెంకట్రావు మరలా నవ్వటం మొదలెట్టాడు.

"స్టాప్ట్ఇట్" బాబ్జీ పెద్దగా అరిచాడు.

వెంకట్రావు ఆగిపోయాడు.

"నువ్వు కబుర్లు చెప్పి మోసం చేసినా ఈ మోసాన్ని నేను సాగనివ్వను. నా సోదరి భారతిని, నీ కసాయి పెత్తందారీ విష బాహువుల నుండి విముక్తం చేస్తాను" బాబ్జీ మాటలకు ఈ సారి వెంకట్రావు మరింతగా నవ్వాడు. నవ్వి, వెంటనే అన్నాడు:

"అది నీ వల్ల కాదు."

"అవుతుంది."

"కాదు. నే నిప్పుడ పెద్ద రాయిమీద కూర్చుని ఉన్నాను. ఆ రాయిని కదలనీకుండా వెనగ్గా ఎంత మంది జనం పట్టుకున్నారో చూడు. నువ్వు నన్నేం చేస్తావ్. నీ చేతిలో ఉంది ఒక రంగులో ముంచిన కుంచె... దానిపెట్టి నువ్ కొడితే దాని మొన నాకు మెత్తగా తగులుతుంది."

"అదే నీ పొరపాటు నా కుంచె మెత్తటి చివర్ల నుండి నీ కర్కశత్వపు ప్రతిరూపాన్నీ, అమాయకుల రక్తం రుచి మరిగిన నీ రాక్షసత్వాన్నీ, బొమ్మలుగా చిత్రించి నీ రాతి గుండెల సింహాసనాన్ని పడిపోకుండా పట్టుకున్న ఆ పావన శ్రమ జీవనానికి చూపిస్తాను. నీ దుర్మార్గపు నైజాన్ని నా మిత్రులంచేత కథలుగా, కవితలుగా, పాటలుగా పలికిస్తాను. పాడిస్తాను, అపుడు తాము మోస్తున్న తమ గుండెల బరువునూ చీకటినీ వారు తెలుసుకుంటారు. వారు మరేం చెయ్యరు. తామింత కాలంగా ఎండలో, వానలో, చలిలో నిర్విరామంగా ఇచ్చిన చేయూతను వదులుకొని ఇవతలికి వచ్చేస్తారు. అప్పుడు నీవు కూర్చుని కులుకుతున్న ఈ నల్ల రాతి సింహాసనం సముద్రంలో కలిసిపోయి చరిత్ర హీనత్వం నీకు ప్రాప్తిస్తుంది. ఇది ముమ్మాటికీ నిజం."

బాబ్జీ మాటలకు వెంకట్రావు కళ్ళు పెద్దవిచేసి ఈ సారి పెద్దగా నవ్వటం మొదలెట్టాడు.

అలాగే నవ్వుకుంటూ అక్కడి నుంచి లేచి భారతి వైపుగా నడవటం మొదలెట్టాడు. భారతి భయంతో కంపిస్తూ క్రింద పడిపోయింది. వెంకట్రావు ఆమెకు దగ్గరగా పోయి చెయ్యి పట్టుకున్నాడు. సింహం విసిరిన పంజా క్రింద లేడి పిల్లలా భారతి

బాబ్జీకి ఆవేశ మొచ్చింది.

' ... బిగ్గరగా అరిచాడు.

"ఏమిట్రా ... ఏం జరిగింది. ఏదైనా పీడకల వచ్చిందా?" బాబ్జీ అత్తయ్య, బాబ్జీని నిద్రలేపి అడిగింది. వెంటనే లైటు వేసింది. చుట్టూ చలిగాలి వేస్తున్నా అతని ముఖంలో మాత్రం స్వేదం కని పించింది.

"ఏమిట్రా అలా అయిపోయావ్" ఆమె గాభ రాగా అడిగింది.

"మరేంలే దత్తయ్యా ..." బాబ్జి నిట్టూర్చాడు.

"ఏమీ లేకపోవడ మేమిటి ఏదో భూతం పట్టిన వాడిలా పెద్దగా కేకపెట్టావ్. ఇంకా నయం. పిల్లలెవరూ లేవలేదు. మీ మామయ్యను లేపనా" అంది

"వద్దు ... కాని అత్తయ్యా ... భూతమే పట్టింది. నాకు కాదు. భారతికి" వెకిలిగా నవ్వుతూ అన్నాడు.

"ఏ భారతికి" ఆమె కర్థం కాక అనుమానంగా అతని వంక చూస్తూ అడిగింది.

"ఆ భూతానిక్కూడా సమాధానం చెప్పాను."

"ఏమని చెప్పావ్?"

"నిన్ను వదలగొడతానని."

బాబ్జి అత్తయ్య మరి కాస్త గాభరాపడింది.

"ఏమిట్రా ... ఇంకా నిద్రనుంచి మేల్కో లేదా?"

"ఇప్పుడే మేలుకొన్నాను" బాబ్జి నవ్వుతూ అన్నాడు.

"హమ్మయ్య ... నిద్రపోయింది గదా ... కాసిని మంచినీళ్ళు త్రాగి పడుకో ..." ఆమె అని మంచి నీళ్ళు తేవటానికి ప్రక్క గదిలోకి పోయింది.

'విషాదభారతి' చిత్రం అతని మనసులో రూపం దిద్దుకుంటూంది. ✱

